సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 21 । జనవరి । 2024



కళ్లాలకు పంట.. ఆనందమే ఇంట!
ఆరుగాలం శ్రమించి పండించిన పంట కళ్లాలకు చేరింది. ప్రభుత్వం కూడా మద్దతు ధర ప్రకటించడంతో రైతు ఇంట ఆనందం నెలకొంది. 8లో



టమాట కిలో రూ.16
కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.16 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.1°/15.4°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి వాతావరణం కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతం



అనంతపురంలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయలో 6వ తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 8,857 మంది దరఖాస్తు చేసుకోగా, అధికారులు 34 కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షకు 4,871 మంది మాత్రమే హాజరయ్యారని లేపాక్షి నవోదయ పాఠశాల ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. అనంతపురం నగరంలోని పలు పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించారు.

23న రేకులకుంటలో కిసాన్ మేళా

కదిరి అర్బన్: పంటల సాగులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు పరిచయం చేసేందుకు ఈనెల 23న రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానంలో 'కిసాన్ మేళా' ఏర్పాటు చేసినట్లు కదిరి వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా. సంపత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని భారతీయ నూనె గింజల పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు మేళాలో పాల్గొంటారన్నారు. వ్యవసాయంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డ్రోన్ల ఉపయోగం, వ్యవసాయ యంత్రీకరణ, టిష్యూ కల్చర్, జీవన ఎరువుల కంపెనీలు స్టాళ్లు ఏర్పాటు చేస్తాయన్నారు. శాస్త్రవేత్తలు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తారని, రైతులు కిసాన్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చంద్రబాబును ప్రజలు నమ్మరు

- విలేకరులతో మంత్రి ఉషశ్రీ చరణ్



మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీ చరణ్

పరిగి: తన రాజకీయ లబ్ధి కోసం కల్లిబొల్లి మాటలు చెప్పే చంద్రబాబును ప్రజలు నమ్మే స్థితిలో లేరని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి, పెనుకొండ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ అన్నారు. శనివారం పరిగి మండలంలో పర్యటించిన ఆమె..పైడేటిలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు గురించి, ఆయన గతంలో చేసిన పరిపాలన గురించి ప్రజలకు ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదన్నారు. టీడీపీ పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమం శూన్యమన్నారు. బూటకపు హామీలతో గతంలో గద్దెనెక్కి అందరినీ మోసం చేసిన చంద్రబాబు ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని జనాల్లోకి వస్తున్నారని ప్రశ్నించారు.

కృతజ్ఞతగా మద్దతు తెలుపుదాం..
కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో లక్షలాది ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలను కల్పించడమే కాకుండా మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్ద పీట వేశారన్నారు. వృద్ధులు, డ్వాక్రా అక్కచెల్లెమ్మలు, దివ్యాంగులు, విద్యార్థులు... ఇలా అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలబడిన వ్యక్తి జగనన్న అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రాజకీయంగా పదవులతో పాటూ నామినేటెడ్ పోస్టుల్లోనూ ప్రాధాన్యం ఇచ్చి పాలనలో భాగస్వామ్యం చేశారన్నారు. రాష్ట్రంలో వెనకబడిన కులాలకు అవకాశాలిచ్చిన జగనన్నకు కృతజ్ఞతగా అందరం ఆయనకు మద్దతు తెలుపుదామని పిలుపునిచ్చారు. పెనుకొండలో మరోసారి వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి ఈ విజయాన్ని జగనన్నకు కానుకగా ఇద్దామన్నారు.

నేతన్నకు సర్కార్ చేయూత



ఈ చిత్రంలోని మహిళ పేరు నాగేంద్రమ్మ. కొత్త చెరువు మండలం మైల సముద్రం. ఇద్దరు కుమార్తెలు సంతానం. కొన్నేళ్లుగా మగ్గంపై పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. గతంలో వార్పు, నూలు, ఇతర సామగ్రి కొనుగోలుకు అవసరమైన డబ్బు కోసం ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పు చేసేది. చీర తయారయ్యాక వచ్చిన డబ్బులో వడ్డీకే అధికంగా చెల్లించాల్సి వచ్చేది. అయితే సీఎం జగన్ మోహన్‌రెడ్డి 'నేతన్న నేస్తం' అమలు చేయడంతో వడ్డీ ఇబ్బందులు తప్పాయని నాగేంద్రమ్మ ఆనందంగా చెబుతోంది. ఏటా తన ఖాతాలో రూ.24 వేలు ప్రభుత్వం జమ చేయడంతో తమ కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకుందని, తమకు చేయూత నిచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లప్పుడూ రుణ పడి ఉంటామని చెబుతోంది.



ఈమె పేరు సాయిలీల. పుట్టపర్తిలోని తారకరామ నగర్. ఇద్దరు కుమారులు సంతానం. భర్తతో కలిసి మగ్గం పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ప్రభుత్వ స్కూళ్లలో సదుపాయాలు పెరగడంతో పిల్లలిద్దరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించింది. నేతన్న నేస్తం పథకం కింద ఏటా రూ.24 వేలు అందుతోంది. దీంతోపాటు 'ముద్ర' పథకం కింద రుణం మంజూరైంది. అలాగే జాతీయ అభివృద్ధి చేనేత మండలి ద్వారా కూడా 90 శాతం సబ్సిడీతో మగ్గం పనిముట్లు అందడంతో సాయిలీల కుటుంబం ఆర్థికంగా నిలబడింది. గతంలో చాలీచాలని ఆదాయం, పెట్టుబడి కోసం చేసిన అప్పులు, పిల్లల స్కూలు ఫీజులు..ఇలా ఆర్థికంగా ఇబ్బంది పడేవారమని, కానీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక తమకు ఎంతో మేలు జరిగిందని సాయిలీల చెబుతోంది.



- 90 శాతం సబ్సిడీతో అధునాతన యంత్ర పరికరాలు
- 50 ఏళ్ల నిండిన చేనేత కార్మికులకు పింఛన్
- విజయవంతంగా 'నేతన్న నేస్తం' అమలు
- ఏటా రూ.24 వేల చొప్పున నేరుగా ఖాతాల్లో జమ
- ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న నేతన్నలు

పుట్టపర్తి టౌన్: జనరంజక పాలనతో అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేనేత రంగానికి ఊపిరి పోశారు. వివిధ పథకాలతో నేతన్నలకు అండగా నిలిచారు. 'వైఎస్సార్ నేతన్న నేస్తం' పథకం కింద ఏటా రూ.24 వేలు అందించడంతో పాటు ముద్ర రుణాలు, జాతీయ చేనేత అభివృద్ధి పథకం ద్వారా 90 శాతం సబ్సిడీతో పనిముట్లు, జాతీయ చేనేత బ్రాండ్ పథకం ద్వారా నేత కార్మికులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో చేనేత రంగం గాడిన పడుతోంది. వృత్తి వదిలేసిన నేతన్నలు కూడా తిరిగి రావడంతో మగ్గాలకు మళ్లీ మంచిరోజులు వచ్చాయి.

నాడు నిర్వీర్యం..
జిల్లాలో 28,500 మగ్గాలుండగా, 33,274 మంది కార్మికులు పనిచేస్తున్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబు నేతన్నలను కేవలం ఓటు బ్యాంకుగానే చూశారు. వారి సంక్షేమానికి ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. వర్షాకాలం పరిశ్రమకు అంతరాయం కలిగినప్పుడు నెలకు రూ.4 వేలు, వంద యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్య బీమా, చేనేత కార్మికులకు ఇళ్లు, షెడ్లు, భవనాలు అంటూ హామీలిచ్చినా...ఒక్కటంటే ఒక్కటీ కార్యరూపం దాల్చలేదు. 'ఆదరణ' పథకం కింద డబ్బులు కట్టించుకుని అరకొర సామగ్రి ఇచ్చి చేతులు దులుపుకున్నారు. దీంతో నేతన్నలు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకున్నారు.

జిల్లాలో 'నేతన్న నేస్తం' లబ్ధిదారుల వివరాలు ఇలా..	
సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య
2019-20	16,813
2020-21	14,640
2021-22	14,224
2022-23	14,973
2023- 24	15,509

నేడు పూర్వ వైభవం
నాడు ప్రతిపక్షనేతగా చేనేతల దుర్భర జీవితాలను కళ్లారా చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే నేతన్నల సంక్షేమానికి చర్యలు తీసుకున్నారు. 2019 డిసెంబర్ 21న జిల్లాలోని ధర్మవరం నుంచే 'వైఎస్సార్ నేతన్న నేస్తం' పథకాన్ని ప్రారంభించి వారి జీవితాల్లో వెలుగులు నింపారు. అప్పటి నుంచి క్రమం తప్పకుండా ఏటా రూ.24 వేలు అందిస్తూ అండగా నిలుస్తున్నారు. ఇప్పటి వరకూ ఐదు విడతల్లో జిల్లాలోని నేతన్నలకు రూ.183.49 కోట్లు ఖాతాల్లో జమ చేశారు. 50 ఏళ్లు దాటిన 15,983 మందికి పింఛన్ అందిస్తున్నారు. చేనేత ముద్ర పథకం ద్వారా చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న 594 మందికి రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకూ రుణాలు మంజూరు చేశారు. జిల్లాలో చేనేత క్లస్టర్లు ఏర్పాటు చేసి రుణాలు అందిస్తున్నారు. అలాగే పలువురికి సబ్సిడీపై మగ్గాలు అందించారు. వర్క్ షెడ్లు, పర్మినెంట్ షెడ్లు మంజూరు చేస్తూ నేతన్నలకు అండగా నిలిచారు. ఫలితంగా నేతలన్నంతా ఉత్సాహంగా పనిచేసుకుంటుండగా, చేనేత రంగానికి పూర్వ వైభవం వచ్చింది.

అండగా నిలిచారు



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో నేతన్నల కష్టాలు తెలుసుకున్నారు. అందుకే ఇచ్చిన హామీ మేరకు క్రమం తప్పకుండా ఏటా నేతన్న నేస్తం అమలు చేస్తున్నారు. ఈ పథకంతో నేతన్నల ఇక్కట్లు తొలుగుతున్నాయి. మాకు అండగా నిలిచిన జగనన్నకే మా మద్దతు. - మహబూబ్‌బాషా, బుక్కపట్నం

అర్హత ఆధారంగా పథకాలు



అర్హత ఆధారంగా చేనేతలకు పథకాలన్నీ అందజేస్తున్నాం. చేనేత క్లస్టర్ల పరిధిలో కార్మికులకు పనిముట్లు అందజేశాం. రకరకాల డిజైన్ల తయారీకి కూడా చర్యలు తీసుకున్నాం. నేతన్నలకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాం. అలాగే 50 ఏళ్లు నిండిన నేతన్నలకు పింఛన్లు అందజేస్తున్నాం. దీంతో పాటు ముద్ర రుణాలు కూడా మంజూరు చేయించాం. - రమేష్, ఏడీ, చేనేత, జౌళి శాఖ

ఫిర్యాదులన్నీ పరిష్కరించాం

- తప్పుల్లేని ఓటరు జాబితా సిద్ధం చేశాం
- జిల్లా ప్రత్యేకాధికారి మురళీధర్‌రెడ్డికి తెలిపిన జేసీ అభిషేక్



మురళీధర్‌రెడ్డితో కలిసి సమీక్షిస్తున్న జేసీ

పుట్టపర్తి అర్బన్: రాజకీయ పార్టీలు, వివిధ వర్గాలు, వ్యక్తుల నుంచి అందిన ఫిర్యాదులన్నీ పరిష్కరించి తప్పులేని ఓటరు జాబితా తయారు చేసినట్లు జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ప్రత్యేకాధికారి మురళీధర్‌రెడ్డికి తెలిపారు. ఈ నెల 22న (సోమవారం) ఓటరు తుది జాబితా విడుదల చేయనున్న నేపథ్యంలో ప్రత్యేకాధికారి మురళీధర్‌రెడ్డి, జేసీ అభిషేక్‌కుమార్ శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఓటరు జాబితా మార్పులు, చేర్పులు, నూతన ఓటరు నమోదు తదితర అంశాలపై కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్... జిల్లాలో పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. జిల్లాలో 1,561 పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు జేసీ వివరించారు. ఇందులో 367 పట్టణ ప్రాంతాల్లో, 1,194 పోలింగ్ కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి సగటున 891 మంది ఓటర్లు ఉన్నారన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఈపీ రేషియో 997 కాగా, ప్రస్తుత జనాభా ప్రకారం జనవరి 12వ తేదీ నాటికి 1,004గా ఉందన్నారు. జిల్లాలో స్త్రీ, పురుష సగటు నిష్పత్తి 995 ఉందన్నారు. మొత్తం జిల్లాలో 13,91,628 మంది ఓటర్లుగా ఉండగా, అందులో మహిళలు 6,97,119 మంది, పురుషులు 6,94,446 మంది, ట్రాన్స్‌జెండర్లు 63 మంది ఉన్నారని జేసీ అభిషేక్‌కుమార్ వివరించారు. ఓటరు తుది జాబితా తయారీకి జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలు సంతృప్తికరంగా ఉన్నాయని ప్రత్యేకాధికారి మురళీధర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల కమిషన్ అనుమతి తర్వాత గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఓటరు జాబితా సమర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓలు భాగ్యరేఖ, వంశీకృష్ణ, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

సకలం.. 'విజయ సంకల్పం'



కుసుమవారి పల్లి వద్ద దుద్దుకుంటకు స్వాగతం పలుకుతున్న అభిమానులు



పాదయాత్రలో పాల్గొన్న మహిళలు



భారీ జనసందోహంతో కలిసి పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

ఓడీచెరువు: ఊరూవాడ ఏకమయ్యాయి. గ్రామాలకు గ్రామాలే తరలి వచ్చాయి. పాదయాత్రగా తమ గ్రామానికి విచ్చేస్తున్న అభిమాన నాయకుడికి ఎదురెళ్లి స్వాగతం పలికాయి. పుట్టపర్తి నియోజకవర్గంలోని 193 చెరువులను కృష్ణా జలాలతో నింపే పనులకు శ్రీకారం చుడుతూ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చేపట్టిన 'డాక్టర్ వైఎస్సార్ రైతు విజయ సంకల్ప యాత్ర' రెండోరోజు శనివారం కుసుమవారిపల్లి వద్ద ఓడీచెరువు మండలంలోకి ప్రవేశించింది. శుక్రవారం రాత్రి నల్లమాడ మండలం కురుమాలలో బస చేసిన దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి...శనివారం ఉదయం 9.30 గంటలకు పాదయాత్ర ప్రారంభించి ఓడీ చెరువు మండలంలోకి ప్రవేశించారు. ఉదయం కుసుమవారి పల్లి మీదుగా గాజుకుంటపల్లికి చేరుకున్న శ్రీధర్‌రెడ్డి అక్కడ మహిళలతో ముఖాముఖి అయ్యారు. అనంతరం సుందరయ్య కాలనీ, నారప్పగారిపల్లి, నల్లగుట్లపల్లి, మల్లెంవాండ్లపల్లి, బోగానిపల్లి, కుంట్లపల్లి క్రాస్, వీరహోబునపల్లి మీదుగా దొన్నికోటవారిపల్లికి చేరుకుని రాత్రికి అక్కడే బస చేశారు. రెండోరోజు మొత్తం 20.4 కి.మీ మేర పాదయాత్ర సాగింది. ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, 'అపుస్మా' అధ్యక్షుడు పుల్లారెడ్డి తదితరులు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి సంఘీభావం తెలిపి కలిసి నడిచారు. ప్రతి గ్రామంలోనూ ఎమ్మెల్యే దుద్దుకుంటకు ఘన స్వాగతం లభించింది. మహిళలు హారతులు పడుతూ స్వాగతించారు. అభిమానులు పూలు చల్లుతూ, బాణసంచా పేలుస్తూ సందడి చేశారు.

ప్రతి పల్లెకూ సాగు.. తాగునీరు
రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. పాదయాత్రలో భాగంగా ఆయా గ్రామాల్లో ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. తన పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే కరువు నివారణ పథకం కింద నియోజకవర్గానికి రూ.864 కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో నియోజకవర్గంలోని 193 చెరువులను కృష్ణా జలాలతో నింపి ప్రతి గ్రామానికీ సాగు, తాగునీరు అందిస్తామన్నారు.

మళ్లీ మోసపోకండి
''ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీ పగటి వేషగాళ్లు గ్రామగ్రామానికీ వస్తారు. ఎన్నెన్నో హామీలు గుప్పిస్తారు. వారి మాయలు చూసి మోసపోకండి'' అని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మహిళలకు సూచించారు. గాజుకుంట్లపల్లిలో మహిళలతో ముఖాముఖి అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలోనూ టీడీపీ నేతలు డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తాం, మీ బంగారు మీ ఇంటికే చేరేలా చూస్తామంటూ హామీలిచ్చినా... ఏ ఒక్కటైనా నెరవేర్చారా అక్కా.... అని మహిళలను ప్రశ్నించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాట మీద నిలబడే నాయకుడని, అందరం ఆయనకు మద్దతు తెలిపి మరోసారి సీఎంను చేసుకుందామన్నారు. పాదయాత్రలో మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ పర్వీన్ భాను, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రాజు నాయుడు, పట్టణ కన్వీనర్ కృష్ణారెడ్డి, మైనార్టీ సెల్ కార్యదర్శి షామీర్ బాషా, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆనంద్ రెడ్డి, బూత్ లెవెల్ మేనేజర్ గోవర్ధన రెడ్డి, ఎస్సీసెల్ కన్వీనర్ రామాంజి, బీసీ సెల్ కన్వీనర్ చింతా వెంకటేష్, నాయకులు హనుమంత రెడ్డి, వెంకటరెడ్డి, చెన్నారెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

సీఎం పర్యటనకు పక్కాగా ఏర్పాట్లు చేయండి



హెలిప్యాడ్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, తలశిల రఘురాం, కలెక్టర్ గౌతమి, సమన్వయకర్త విశ్వ, ఇతర ప్రజాప్రతినిధులు

- అధికారులకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచన

ఉరవకొండ: 'వైఎస్సార్ ఆసరా' కింద డ్వాక్రా సంఘాలకు నాలుగో విడత సొమ్ము విడుదల చేసే కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 23న ఉరవకొండకు వస్తున్నందున, పర్యటన ఏర్పాట్లు పక్కాగా చేయాలని అనంతపురం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికారులకు సూచించారు. శనివారం స్థానిక లత్తవరం రోడ్డులోని తొగటవీర క్షత్రియ కల్యాణమండపంలో సీఎం పర్యటన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ గౌతమి, ఎస్పీ అన్బురాజన్, ముఖ్యమంత్రి కార్యక్రమాల కో ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీలు వై.శివరామిరెడ్డి, మంగమ్మ, పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరు సాంబశివారెడ్డి, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్ పాల్గొన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు వేగవంతం చేయాలన్నారు. సభకు వచ్చే మహిళా సంఘాల సభ్యులు, ప్రజలు కూర్చునేందుకు వీలుగా చైర్లు, తాగునీటి బాటిళ్లు, బిస్కెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఆయా గ్రామాలకు బస్సులు ఎన్ని కావాలో అన్నీ సిద్ధం చేయాలన్నారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో పాటు అత్యవసరంగా వైద్య శిబిరాలు సిద్ధంగా ఉంచాలన్నారు.

బహిరంగ సభాస్థలిని పరిశీలించిన మంత్రి..
ఉరవకొండలోని అనంతపురం బైపాస్‌లోని భారత్ పెట్రోల్ బంకు పక్కన సీఎం పాల్గొనే బహిరంగ సభా స్థలాన్ని, వెహికల్ పార్కింగ్, హెలిప్యాడ్ ల్యాండింగ్ స్థలాలను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరిశీలించారు. సభకు వృద్ధులను తీసుకురాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కేటాయించిన పనులను గడువులోపు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, ఏఎస్పీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఐఅండ్‌పీఆర్ డీపీఓ గురుస్వామి శెట్టి, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ నాగరాజారావుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాడు-నేడు పనుల పూర్తికి చర్యలు



పనులను పరిశీలిస్తున్న డీఈఓ మీనాక్షి

అగళి: మండల వ్యాప్తంగా పాఠశాలల్లో జరుగుతున్న 'నాడు-నేడు' పనుల పూర్తికి చర్యలు తీసుకుంటామని డీఈఓ మీనాక్షి తెలిపారు. శనివారం ఆమె స్థానిక కేజీబీవీని తనిఖీ చేశారు. విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. పాఠశాలలో రికార్డులు పరిశీలించారు. 'నాడు-నేడు' పనులపై ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడుతో సమీక్షించారు. ఉపాధ్యాయుల అటెండెన్స్ యాప్‌పై కూడా ఆరా తీశారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించండి

- ఆర్టీసీ డిపో మేనేజర్లకు డీపీటీఓ మధుసూదన్ ఆదేశం

పుట్టపర్తి టౌన్: జిల్లాలోని అన్ని డిపోల్లో రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించాలని డీపీటీఓ మధుసూదన్ ఆదేశించారు. శనివారం స్థానిక ఆర్ఎం కార్యాలయంలో డిపో మేనేజర్లు, ట్రాఫిక్ సిబ్బంది, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన 1,300 మంది ఉద్యోగులకు వార్షిక ఇంక్రిమెంట్లు, 69 మందికి గ్రాట్యుటీ ఇంక్రిమెంట్లు అందించామన్నారు. పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. డ్రైవర్లు నియమాలు పాటిస్తే ప్రయాణికులను సురక్షితంగా గమ్యాలకు చేర్చవచ్చన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాలకు పోలీసులు, రవాణ శాఖ అధికారులను ఆహ్వానించి డ్రైవర్లకు సూచనలు, సలహాలు అందించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

కళ్లాలకు పంట.. ఆనందమే ఇంట!




గోరంట్ల మండలం వానవోలు వద్ద కళ్లాల్లో కంది పంటను ఆరబెట్టిన దృశ్యం, పెడపల్లి వద్ద ఉలవ పంటను ఆరబెడుతున్న రైతు (ఇన్‌సెట్) అమ్మకానికి సిద్ధం చేసిన ఉలవలు

పుట్టపర్తి అర్బన్: ఆరుగాలం శ్రమించి పండించిన పంట ఉత్పత్తులు కళ్లాలకు చేరుతున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర బాగా ఉండడం, మార్కెట్‌లో కూడా రేట్లు ఎక్కువగా పలుకుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాభావం నెలకొనడంతో మెట్ట భూముల్లో పంట సరిగా పండలేదు. ఈ క్రమంలోనే సాగు విస్తీర్ణం పెంచడానికి ఖరీఫ్ పూర్తయ్యే సమయంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహించింది. 80 శాతం సబ్సిడీతో ఉలవ, పెసర, అలసంద విత్తనాలు పంపిణీ చేసింది. జిలాయాప్తంగా ఖరీఫ్‌లో 66 వేల హెక్టార్లలో పంటలు సాగులో రాగా, అందులో ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణం సుమారు 7,200 హెక్టార్లు.

'కంది'పోకుండా ధీమా..

జిల్లాలో కంది పంటను 5,680 హెక్టార్లలో సాగు చేశారు. 6 నెలల పంట కాలం పూర్తి కావడంతో రైతులు కొన్ని రోజులుగా కోసి కళ్లాల్లో ఆరబెడుతున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధరలకు కందులు కొనుగోలు చేస్తామని ప్రకటించడంతో మంచి ధరలు అందనున్నాయి. క్వింటాలు రూ.7 వేలు ప్రకటించిన ప్రభుత్వం మరో రూ.500 పెంచుకునేందుకు వెలుసు బాటు కల్పించింది. దీంతో కందికి మంచి ధరలు లభించనున్నాయి. కంది ఎకరాకు మెట్ట భూమిలో 4 క్వింటాళ్ల నుంచి 5 క్వింటాళ్లు, నీటి పారకం ఉన్న పంటలో 8 క్వింటాళ్ల నుంచి 10 క్వింటాళ్ల వరకూ దిగుబడి వచ్చినట్లు తెలుస్తోంది.

ఉలవకూ మంచి ధర..

ఉలవ పంటను 1,737 హెక్టార్లలో సాగు చేసిన రైతులు కేవలం 3 నెలల్లోనే పంట కాలం పూర్తి కావడంతో తొలగించి కళ్లాలకు చేరుస్తున్నారు. ఉలవకు వ్యాధులు సోకక పోవడం, ఎరువులు అవసరం లేకపోవడం పశు గ్రాసంతో పాటు మార్కెట్‌లో మంచి ధరలు లభిస్తుండడంతో రైతులకు లాభాలు వస్తున్నాయి. ప్రస్తుతం క్వింటాలు ఉలవ రూ.6 వేల వరకూ పలుకుతోంది. వీటిని వ్యాపారులు కొనుగోలు చేసి పశువుల దాణా, కోళ్ల దాణా తయారు చేసే కంపెనీలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది



కాలిపోయిన డ్రిప్ పరికరాలు

అరటి తోట దగ్ధం

ఆత్మకూరు: ఆరుగాలం కష్టపడి సాగు చేసిన అరటి పంట చేతికి వచ్చే సమయంలో అగ్నికి ఆహుతైంది. దాదాపు రూ.12 లక్షల నష్టం వాటిల్లడంతో రైతు ఆవేదన వర్ణనాతీతంగా మారింది. వివరాలు.. ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామానికి చెందిన ఎంపీటీసీ పోతులయ్య తన 6 ఎకరాల్లో అరటి పంట సాగు చేశాడు. 10 రోజుల్లో పంట కోత కోయాల్సి ఉంది. శనివారం ఉదయం పొలంలో మంటలు గుర్తించిన గొర్రెల కాపర్లు వెంటనే పోతులయ్యకు ఫోన్ చేశారు. ఆయన పలువురు గ్రామస్తులతో కలసి పొలానికి చేరుకొని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అదుపు కాకపోవడంతో ఫైర్ ఇంజిన్‌కు సమాచారమిచ్చారు. వారు వచ్చి మంటలు ఆర్పే లోపే పంట మొత్తం దగ్ధమైంది. 40 డ్రిప్ కట్టలు, 150 స్ప్రింక్లర్ పైపులు, 40 పీవీసీ పైపులు, సర్వీస్ వైర్ కూడా కాలిపోయాయి. దీంతో రూ.12 లక్షల వరకు నష్టం జరిగిందని రైతు పోతులయ్య వాపోయారు. 10 రోజుల్లో కోత కోయాల్సి ఉందని, పంటను అమ్మి ఉంటే దాదాపు రూ.10 లక్షల వరకు వచ్చేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకున్నారు.

తేనెటీగల దాడిలో బాలురకు గాయాలు



తేనెటీగల దాడిలో గాయపడిన బాలురు

- ఆస్పత్రికి తరలిస్తుండగా రోడ్డు ప్రమాదం
- వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన గిరిని పరామర్శిస్తున్న హిందూపురం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక

హిందూపురం: హిందూపురం మండలం బీరేపల్లి వద్ద ముగ్గురు బాలురపై తేనె టీగలు దాడి చేశాయి. బాధితులను హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి ద్విచక్ర వాహనంలో తీసుకెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. వివరాలు... శనివారం బీరేపల్లి వద్ద చెట్టుపై నుంచి తేనెతుట్టె కింద పడింది. ఈ క్రమంలోనే అక్కడే ఉన్న ముగ్గురు బాలురపై తేనెటీగలు దాడి చేశాయి. ముఖం, వీపుపై కరిచాయి. గాయాలపాలైన వారిని గిరి అనే వ్యక్తి మోటార్ బైక్‌పై హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువస్తుండగా లారీ ఢీ కొంది. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే 108 వాహనంలో అతడిని, తేనె టీగల దాడిలో గాయపడిన బాలురను ఆస్పత్రిలో చేర్చారు. బాధితులను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులతో తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లను కోరారు. ఆర్థిక సాయం అందజేస్తానని హామీ ఇచ్చారు.

మట్కా బీటర్ల అరెస్ట్

గుడిబండ: మండల పరిధిలోని చిగతుర్పి గ్రామానికి చెందిన ఇద్దరు మట్కా బీటర్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ మునిప్రతాప్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం చిగతుర్పి గ్రామ సమీపంలో దాడులు నిర్వహించామన్నారు. అమరాపురం-గుడిబండ మార్గంలో మట్కా పట్టీలు రాస్తూ డబ్బు వసూలు చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి రూ.1,02,400 నగదుతో పాటు మట్కా పట్టీలు, మొబైల్ ఫోను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు చంద్రశేఖర్, రఫీక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం

నల్లచెరువు: పొలంలో బోరు వేయడానికి తండ్రి డబ్బులు ఇవ్వలేదనే మనస్తాపంతో యువకుడు బలవన్మరణం పొందిన ఘటన కుమ్మరవాండ్లపల్లిలో జరిగింది. ఎస్ఐ లింగన్న తెలిపిన మేరకు.. మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లికి చెందిన లోకేష్ (27) తమ వ్యవసాయ పొలంలో బోరు వేద్దామని శుక్రవారం తండ్రి ఎల్లప్పను కోరాడు. రూ.2 లక్షలు ఇవ్వాలని విజ్ఞప్తి చేయగా.. తండ్రి నిరాకరించాడు. దీంతో మనస్తాపం చెందిన లోకేష్ బయటకు వెళ్లిపోయాడు. ఈ క్రమంలోనే తమ పాత ఇంటి వద్ద ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం పొలం వద్దకు వెళ్లే సమయంలో తండ్రి ఎల్లప్ప ఈ విషయాన్ని గుర్తించాడు. బోరును విలపించాడు. ఎస్ఐ లింగన్న ఘటనా స్థలిని పరిశీలించారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


యువకుడి ఆత్మహత్య



సుబ్రమణ్యం(ఫైల్)

ధర్మవరం అర్బన్: ఒంటరితనం భరించలేక మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలోని రాంనగర్‌లో జరిగింది. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. రాంనగర్‌కు చెందిన సుబ్రమణ్యం (20) తల్లిదండ్రులు రామాంజినేయులు, రత్నమ్మ మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. తోడుగా ఉన్న అన్న దామోదర్ సైతం కొన్నాళ్లకు అప్పుల బాధతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో సుబ్రమణ్యం ఒంటరితనం భరించలేక రోజూ మనోవేదనకు గురయ్యేవాడు. ఈ క్రమంలోనే శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు. మృతునికి ఇంకా పెళ్లికాలేదు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడిని అరెస్టు చూపుతున్న సీఐ యతీంద్ర

ముదిగుబ్బ: మహిళ హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. శనివారం ముదిగుబ్బ పోలీస్ స్టేషన్‌లో కేసు వివరాలను సీఐ యతీంద్ర వెల్లడించారు. బత్తలపల్లి మండలం ఎం.చెర్లోపల్లికి చెందిన చెరికూరి ఆదినారాయణ అనంతపురంలోని రామ్‌నగర్‌లో నివసిస్తూ చీటీల వ్యాపారం చేసేవాడు. అక్కడే దరిశ లక్ష్మీదేవి అనే మహిళతో పరిచయం పెంచుకున్నాడు. వివాహేతర సంబంధం కొనసాగించాడు. ఈ క్రమంలోనే ఆమె మరో వ్యక్తితో చనువుగా ఉండడం చూసి రగిలిపోయాడు. ఎలాగైనా ఆమెను అంతమొందించాలని భావించాడు. ఈ నెల 16న లక్ష్మీదేవికి మాయ మాటలు చెప్పి ద్విచక్ర వాహనంలో దొరిగిల్లు ఘాట్‌కు తీసుకొచ్చి మద్యం తాగించాడు. మత్తులో ఉన్న ఆమెను ఆమె చీరతోనే గొంతు బిగించి చంపేసి పరారయ్యాడు. మృతురాలి కుమార్తె నందిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చేపట్టారు. ముందస్తు సమాచారం మేరకు శనివారం రాళ్ల అనంతపురం సమీపంలో అరెస్టు చేశారు.